క్లుప్తంగా

దుర్గమ్మ దేవస్థానానికి పోటెత్తిన భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం అమ్మవారికి సంబరాలు నిర్వహించారు. మండుటెండల్లో కాలినడకన దేవస్థానానికి చేరుకున్న భక్తులు ముర్రాటలు సమర్పించి, అమ్మవారికి చల్లదనం చేశారు. ఘటాలతో వచ్చిన మహిళలు బిందె దీపాలు వెలిగించి తమ మొక్కులు చెల్లించారు. ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ నేతృత్వంలో విశేష అర్చనలు, పూజలు చేపట్టారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు


పెదకుదమలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

జియ్యమ్మవలస: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో కవాతు నిర్వహిస్తున్నట్లు చినమేరంగి ఎస్‌ఐ చిన్నంనాయుడు తెలిపారు. గౌరీపురం, పెదకుదమ గ్రామాలలో కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులతో కలసి మంగళవారం కవాతు నిర్వహించారు. ప్రతి ఓటరు నిర్భయంగా ఎవరికి బెదరకుండా భయపడకుండా, ఏ విధమైన ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సందడిగా గ్రామదేవత సంబరాలు


మహిళల కోలాట ప్రదర్శన

భామిని: మండలంలోని బత్తిలిలో ముత్యాలమ్మ గ్రామ దేవత సంబరాలు మంగళవారం సందడిగా సాగాయి. బత్తిలి కొత్త కాలనీ వాసులు సామూహికంగా చేపట్టిన గ్రామ దేవత సంబరాల్లో భాగంగా మహిళలు కోలాటం ప్రదర్శించారు. ఎజ్జోడు సుందరంగా అలంకరించుకొని డప్పు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేసి అలరించాడు. అమ్మవారికి నైవేద్యంగా తెచ్చిన ప్రత్యేకంగా అలంకరించిన భారీ నెయ్యిల ప్రసాదం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

నేడు మండల సమావేశం

భామిని: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కొవ్వాడ కిశోర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

బీజేపీని ఓడించాలి


మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు

మక్కువ: మండలంలోని దుగ్గేరు ప్రాంతాన్ని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న బీజేపీను ఎన్నికల్లో ఓడించాలని, అరుకు పార్లమెంటరీ స్థానానికి ఐఎన్‌డీఐఏ బలపరిచిన సీపీఎం అభ్యర్థి అప్పలసర్సను గెలిపించాలని కోరారు. ఆయన వెంట భారత్ బచావో నాయకులు కె.విజయరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్, రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఝాన్సి, జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే పథకాల కొనసాగింపు

సంతకవిటి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాల అమలు కొనసాగింపు సాధ్యమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మండాకురిటి గ్రామంలో మంగళవారం పర్యటించిన వారికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగనన్న తపన అని, ఆ దిశగా ఆయన తన ఐదేళ్ల పాలనను కొనసాగించారన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 99 శాతం హామీలు నెరవేర్చి, ప్రజల ఆదరాభిమానా లు పొందారన్నారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో నవరత్నాల ప్లస్ పేరిట ప్రకటించిన హామీలకు సైతం ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నా రు. జగనన్న మాట అంటే ఓ నమ్మకమని, చేయగలిగిందే ఆయన చెప్తారని, చెప్పిందే ఆయన చేస్తారన్న విశ్వాసాన్ని ప్రజలు వ్యక్తం చేస్తుండడం చాలా ఆనందాన్నిస్తోందన్నారు. అధికారం కోసం బూటకపు హామీలతో ఓట్ల కోసం వచ్చే టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు.

సంక్షేమాన్ని చూసి ఓటేయండి


తురకనాయుడువలసలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి దుశ్శాలువతో సన్మానం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని తురకనాయుడువలస, పెదబుడ్డిడి, నీచుకవలస, కుందరతిరువాడ, చింతలబెలగాం గ్రామాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమిని పడగొట్టి హ్యాట్రిక్ విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ ఫలాలను చూసి ఓటేయాలని కోరారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. జగనన్న ఐదేళ్ల పాలనలో నవరత్న పథకాలను అమలు చేసి పేద ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరిచారన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని లేకుంటే కష్టమేనని అన్నారు. తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ సమస్యలపై కృషి చేశానన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామ స్థాయిలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయించే బాధ్యత తీసుకోవాలని కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు ప్రచారంలో డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, నాయకులు కెంగువ వెంకటనాయుడు, సింహాచలం నాయుడు, బాబూ భువనమోహనరావు, కోట రమేష్, ఎం.కిశోర్, అనంతనాయుడు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేలు జరిగిందంటేనే ఓటు వేయండి

- ఎన్నికల ప్రచారంలో మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు


కురుపాంలోని గాంధీనగర్‌లో పరీక్షిత్‌రాజుకు హారతులిచ్చి ఆహ్వానిస్తున్న మహిళలు

కురుపాం: వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో మీ కుటుంబాలకు మేలు జరిగిందంటేనే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. కురుపాంలోని గాంధీనగర్, నెయ్యిలవీధి, నాయుడు వీధి, రజక వీధి, గాజులవీధుల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పరీక్షిత్‌రాజుకు హారతులిచ్చి పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను, మేనిఫెస్టోను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా నిరుపేదలకు అండగా నిలిచిన జగనన్న ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా పాముల పుష్పశ్రీవాణి, ఎంపీగా డాక్టర్ తనూజారాణిని గెలిపించాలని కోరారు. గ్రామ సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీలు వెలమల బంగారు నాయుడు, టి.వి.ఎస్.స్వామియాజులు, గౌడు సంతోషిరాణి, జిల్లా, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, షేక్ జిలానీ, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అంధవరపు కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, కమిడి భూషణరావు, రంజిత్, ఆకుల శీధర్, షేక్ నూర్జెళ్ల, రజ్వీ, వెల్లంకి సత్యనారాయణ, డి.రాము, రాయిపిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం యంత్రాలపై అవగాహన అవసరం


ఈవీఎంలపై సూచనలిస్తున్న ఆర్‌ఓ బన్సల్

సీతంపేట: ఈవీఎం యంత్రాల, వాటి పనితీరుపై పూర్తి అవగాహన ఉండాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ అన్నారు. స్థానిక ఐటీడీఏలో సెక్టోరియల్ అధికారులకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈవీఎంల కమిషనింగ్ చేసి ఓటింగ్‌కి సిద్ధం చేయడంలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. శిక్షణలో అన్ని అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలుంటే ఇప్పుడే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీతంపేట, పాలకొండ తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.

వ్యయ రిజిస్టర్లు పరిశీలన చేయించుకోవాలి

- వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్


మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్

సీతంపేట: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయానికి సంబంధించిన వ్యయ రిజిస్టర్లు తప్పనిసరిగా పరిశీలన చేయించుకోవాలని అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్ అన్నారు. స్థానిక ఐటీడీఏలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ సమక్షంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యయ రిజిస్టర్లో అభ్యర్థి ఎన్నికల ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. మే 2, 6, 11 తేదీల్లో రిజిస్టర్ల పరిశీలన ఉంటుందన్నారు. ఆ రోజుల్లో తప్పనిసరిగా పరిశీలన చేయించుకోవాలన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సత్యనారాయణ


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎన్నికల పర్యవేక్షకులు, సహ సభ్యులు

పాలకొండ రూరల్: స్థానిక న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యర్రాపాత్రుని సత్యనారాయణను సహచర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జరిగిన ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా కిమిడి వెంకటరమణ, సెక్రటరీగా పల్లా మునిస్వామి, సహ సెక్రటరీగా మేడిది వెంకటేశ్వరరావు, కోశాధికారిగా మరిచర్ల జగన్‌మోహనరావు ఎన్నికయ్యారు. ఎన్నికల పర్యవేక్షునిగా సీనియర్ న్యాయవాది గొర్లె సత్యంనాయుడు వ్యవహరించారు. సభ్యులు, సీనియర్ న్యాయవాదులు యు.మురళీమోహన్, అల్లెన గోవిందరాజులు, సీమల కృష్ణారావు, చందక జగదీష్, బి.నరసింగరావు, కర్రా రవి తదితరులు పాల్గొన్నారు. ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్ రాజ్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన న్యాయసేవలను అందించాలని కార్యవర్గానికి సూచించారు.

పరీక్షిత్‌రాజును కలిసిన ఎమ్మెల్సీ రవిబాబు

జియ్యమ్మవలస:


శత్రుచర్ల పరీక్షిత్‌రాజును కలిసిన ఎమ్మెల్సీ రవిబాబు

వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజును ఎమ్మెల్సీ కుంభా రవిబాబు చినమేరంగిలోని తన నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ కొంతసేపు ఎన్నికలకు సంబంధించి చర్చించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ఏం చేయాలో చర్చించారు.

బాలిక అదృశ్యంపై కేసు

కురుపాం: మండలంలోని జి.శివడ పంచాయతీ మధురవలస గ్రామానికి చెందిన బాలిక ఏప్రిల్ 25వ తేదీ నుంచి అదృశ్యమైనట్టు తండ్రి నీలకంఠాపురం పోలీస్‌స్టేషన్‌లో ఏప్రిల్ 29న ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ నీలకంఠారావు తెలిపారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

సేవలతోనే గుర్తింపు


ఉద్యోగ విరమణ చేసిన బ్రాంచ్ మేనేజర్ దంపతులను సత్కరిస్తున్న జట్టు ట్రస్ట్

గరుగుబిల్లి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని జట్టు వ్యవస్థాపకుడు జి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామీణ బ్యాంకు ఆవరణలో ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ గంటా శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా మంగళవారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు దంపతులకు దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరావు గ్రామీణ ప్రాంత ప్రజలకు తన వంతు సేవలందించి మంచి గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ ఎస్.సత్యనారాయణ, వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు, జట్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై ప్రజా విశ్వాసం


మేనిఫెస్టోను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొండ: వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోపై ప్రజలకు విశ్వాసం ఉందని ఆ పార్టీ కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్‌రావు అన్నారు. మండల నాయకులతో ఆయన పలు గ్రామాల్లో మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వస్తున్న స్పందనపై ఆనందం వ్యక్తం చేశారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి చేయగలిగిన హామీలను మాత్రమే ఇస్తారనే నమ్మకంలో ఉన్నారని తెలిపారు. ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతికి అత్యంత ఆదరణ లభిస్తుందని తెలిపారు. ఆయనతో పాటు మండల జేసీఎస్ కన్వీనర్ కోట అజయ్‌కుమార్, నల్లి శివప్రసాద్, రణస్థలం రాంబాబు, వై.లిల్లీపుష్పనాథం ఉన్నారు.

ఇంటి వద్దే దివ్యాంగులకు పింఛన్

గుమ్మలక్ష్మీపురం: దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారికి మాత్రమే మే నెలకు సంబంధించిన పింఛన్ నగదు ఇంటి వద్దే అందజేయడం జరుగుతుందని ఎంపీడీఓ జి.జగదీష్ కుమార్ మంగళవారం తెలిపారు. పింఛన్‌దారుల్లో దివ్యాంగులైన వారు, మంచానికే పరిమితమైన వారు మండలంలో 815 మంది ఉన్నారన్నారు. వీరి కోసం విడుదలైన నగదును పంచాయతీ కార్యదర్శులు, డీడీఓలు బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేశారని, ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ నగదు అందజేస్తారని తెలిపారు.

సిద్ధాంతాల్లేని వ్యక్తి గ్లాసు పార్టీ అభ్యర్థి


నీలానగరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: పాలకొండలో గ్లాస్ గుర్తుపై పోటీ చేస్తున్న జయకృష్ణ సిద్ధాంతాల్లేని వ్యక్తి అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఆయన జయకృష్ణ కాదని, అపజయకృష్ణ అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతితో కలసి మంగళవారం నీలానగరం, కుమ్మరిగుంట, ఎం.వి.పురం, తలవరం గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ విక్రాంత్ తలవరం గ్రామంలో మాట్లాడుతూ సిద్ధాంతాలు లేని ఈ గ్లాసు పార్టీ అభ్యర్థికి ఓటమి తప్పదని హెచ్చరించారు. నమ్ముకున్న పార్టీ టీడీపీకి వెన్నుపోటు పొడిచి సీటు కోసం సిద్ధాంతాలను పక్కన పెట్టి జనసేన పంచన చేరిన ఇటువంటి వ్యక్తులను రానున్న ఎన్నికల్లో తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జయకృష్ణ దేవదాయ, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు కేటాయింపుల్లో రూ.లక్షల సొమ్మును సొంత పార్టీ కార్యకర్తల నుండే వసూళ్లు చేసిన పైరవీకారుడన్నారు. సీతంపేట ఐటీడీఏ అభివృద్ధి పనులు, నీరు - చెట్టు పనుల్లో రూ.కోట్లు ప్రజాధనాన్ని కాజేసారని ఆరోపించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో జయకృష్ణకు హ్యాట్రిక్ ఓటమి ఇచ్చేందుకు మేమంతా సిద్ధం.. మీరంతా సిద్ధమేనా అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి, ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజారాణిని గెలిపించాలని ప్రజలను కోరారు. అంతకు ముందు గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయనతో పాటు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ శిష్టు మధుసూదనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బౌరోతు రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ గేదెల శ్రీనివాసరావు, వావిలపల్లి పురుషోత్తమరావు, మెరుగుల భవానీ, చంద్రమౌళి, ఎం.రాంబాబు, బొత్స సన్యాసినాయుడు, దేవకివాడ విజయగోపాల్, కుడితుల లక్ష్మణరావు, బుగత అమృతరావు, పట్నాన వెంకటరమణ, సుభవాసి గోవిందరావు, గేదెల అప్పలనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, సర్పంచ్‌లు మిడితాన కళ్యాణి, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, నల్లబిల్లి సుహాసిని, భోగి మణి, నీలం సత్యంనాయుడు, జంపు శేఖర్, రంభ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పచ్చ మీడియాకు అభివృద్ధి కనబడదా..!

- ఈనాడు కథనంపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరఘట్టం: వీరఘట్టం పట్టణం అభివృద్ధి జరగకుండా గత టీడీపీ పాలనలో ఓట్ల రాజకీయం చేసి స్థానిక టీడీపీ నాయకులు ఇక్కడ అభివృద్ధిని అడ్డుకోవడం మీకు కనిపించలేదా...అని ఈనాడు పత్రిక యాజమాన్యాన్ని వీరఘట్టం పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం ఈనాడులో వచ్చిన ఓట్లు దండుకునేందుకేనా అనే కథనంపై వీరంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో దశాబ్దాల కాలంగా రోడ్డు విస్తరణ జరగక అభివృద్ధి జరగక ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు ఇక్కడ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు విస్తరణకు రూ.5.50 కోట్లు నిధులు మంజూరు చేయించిన విషయం నిజం కాదా! అని ప్రశ్నించారు. చివరి దశలో ఉన్న పనులు కొద్ది రోజుల పాటు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడితే ఈ ఇబ్బందుల నుండి ప్రజలను గట్టెక్కించేందుకు రోడ్డు పనులను పునః ప్రారంభిస్తుంటే మీకెందుకంత కడుపు మంట అని ఈనాడును ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవాలని చూస్తే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షురాలు దిబ్బ లలితకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగి మణి, పిన్నింటి శ్రీను, కెంగువ ఆంజనేయులు, శంభాన శ్రీను, పిన్నింటి దుర్గారావు, చుక్కా శ్రీను, సైల సుహాష్, అంబళ్ల రవి, జనా శ్రీను, భోగి మదన్, గెంబలి మహేష్, దౌలూరు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి కష్టాలకు చెక్


సంతోషపురం గ్రామానికి రూ.40 లక్షలతో వేసిన బీటీ రహదారి

మండలంలోని పాడి పంచాయతీ పరిధిలో ఉన్న సంతోషపురం, వొప్పంగి గిరిజన గ్రామాలకు చెందిన రహదారులు దశాబ్దాలుగా రాళ్లు తేలి అధ్వానంగా ఉండేవి. అత్యవసర సమయాల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రతీ గిరిజన గ్రామానికి రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. పాడి పంచాయతీలోని సంతోషపురం గ్రామానికి 680 మీటర్ల బీటీ రహదారికి రూ.40లక్షలు, వొప్పంగ గ్రామానికి 2000 మీటర్ల బీటీ రహదారికి రూ.కోటి 50లక్షలు మంజూరు చేసింది. గిరిజన ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు చేపట్టి పూర్తి చేసింది. దీంతో ఈ గ్రామాల ప్రజల రహదారి కష్టాలు తీరాయి. గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – కురుపాం


రూ.కోటి 50 లక్షలతో వేసినన వొప్పంగి గిరిజన గ్రామ రహదారి

పింఛన్ ఇంటి వద్దే ఇవ్వాలి


నిరసన వ్యక్తం చేస్తున్న గుల్లలంక గ్రామానికి చెందిన పింఛన్‌దారులు

గుమ్మలక్ష్మీపురం: మే నెలలో ఇవ్వాల్సిన పింఛన్ నగదును తమకు ఇంటి వద్దే అందజేయాలని మండలంలోని గుల్లలంక గ్రామానికి చెందిన పింఛన్‌దారులు కోరారు. తమ గ్రామంలో వారు మంగళవారం నిరసన తెలిపారు. పింఛన్ నగదు గత నెలలో ఇంటి వద్ద ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడ్డామని, మే నెలకు సంబంధించిన నగదు బ్యాంకు ఖాతాలో వేస్తామని చెబుతున్నారని, తమ బ్యాంకు ఖాతాలు సక్రమంగా నిర్వహణలో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకుకు వెళ్లి విత్‌డ్రా చేయాలంటే సుదూరంలోని మండల కేంద్రం వద్ద గల బ్యాంకుల వద్దకు వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో బ్యాంకుకు వెళ్లి రావాలంటే ఎంతో వ్యయప్రయాసలకు గురి కావాల్సి ఉంటుందన్నారు. తమ ఇబ్బందులను గుర్తించి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ సామల మాధవరావు ఉన్నారు.

ఓటరు స్లిప్పులు సకాలంలో పంపిణీ చేయాలి


పట్టణంలో ఓటరు స్లిప్పులు అందిస్తున్న ఎన్నికల నిర్వహణ సిబ్బంది

పాలకొండ రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్పులను సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ వరహాలు అన్నారు. పట్టణంలోని 9 సచివాలయాల పరిధిలో సిబ్బందికి అందించిన ఈ ప్రక్రియలో అలసత్వం తగదన్నారు. మంగళవారం స్లిప్పుల పంపిణీపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. పోలింగ్ స్టేషన్ నంబర్ 176లో ఈ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బంది మాట్లాడుతూ ఆ సచివాలయంలో 1190 మంది ఓటర్లు ఉండగా వారిలో 573 మంది పురుషులు, 617 మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు. ఐదు వందల పైచిలుకు మందికి ఓటరు స్లిప్పులు అందించినట్లు వీఆర్వో బలివాడ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇదే క్రమంలో 20 వార్డుల్లో ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ పేర్కొన్నారు.

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లోని ఓటర్లకు తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా అవసరమైన స్లిప్‌లను ఆయా గ్రామాల్లోని బీఎల్‌ఓలు పంపిణీ చేస్తున్నారు. మంగళవారం గొట్టివలస సచివాలయ పరిధిలోని గొట్టివలస, మరుపెంట, సాంబన్నవలస, గొల్లవానివలస, టీఆర్ఎన్‌వలస గ్రామాల్లో బీఎల్‌ఓలు భాస్కరరావు, ఆర్.కుంతి, జి.జనార్ధననాయుడు, ఎం.భార్గవులు ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు.


గరుగుబిల్లి : ఓటర్లకు స్లిప్పులను అందజేస్తున్న బీఎల్‌ఓ


గుమ్మలక్ష్మీపురంలో ఓటర్ల స్లిప్పులను పంపిణీ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలో రెండు రోజుల నుంచి చేపట్టిన ఓటర్ల స్లిప్పుల పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలకు రెండు వారాల ముందుగానే బీఎల్‌ఓలు, ప్రత్యేక సిబ్బంది సాయంతో ఓటర్లకు స్లిప్పులను అందజేస్తున్నట్టు తహసీల్దార్ పి.రామారావు తెలిపారు. మరో రెండు రోజుల్లో పంపిణీ పూర్తవుతుందని తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com